
చిన్నకోడూరు- అల్లీపూర్ రోడ్డు దుస్థితి

అధ్వాన దారులు.. ఎన్నాళ్లీ అవస్థలు

మూడు రోజుల నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి మండలంలోని రహదారులన్నీ అధ్వాన్నంగా మారాయి. రోడ్లన్నీ చిత్తడిగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రహదారులపై వర్షపు నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. వానాకాలానికి ముందే గుంతలు పడిన రహదారులకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. – చిన్నకోడూరు(సిద్దిపేట)


ఇళ్ల మధ్య ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

పిచ్చి మొక్కలు.. తప్పని తిప్పలు

అసలే వానలు దంచికొడుతున్నాయి. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు. కానీ పరిశుభ్రత పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారు. దుబ్బాక పట్టణంలో 17వ వార్డులో మురికి కాలువలకు ఇరువైపులా గడ్డి, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. పాములు, విష పురుగులు ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. పిచ్చి మొక్కలను తొలగించాలని కోరుతున్నారు. – దుబ్బాకటౌన్


మబ్బుకుంటతండా- రంగన్నకుంట మధ్యలో కోతకు గురైన రోడ్డు

ప్రయాణం.. ప్రమాదకరం

బీటీ రోడ్డు కోతకు గురైంది. అక్కన్నపేట మండలం మైసమ్మవాగు తండా పరిధిలోని మబ్బుకుంట మీదుగా రంగన్నకుంట నుంచి బండమీదితండా, అంగోతుతండా మీదుగా కోక్యాతండా వరకు గిరిజనశాఖ ఆధ్వర్యంలో రూ. 4 కోట్లు వెచ్చించి నిర్మాణ పనులు చేపట్టారు. అధికారుల పర్యవేక్షణ లోపం.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో చిన్నపాటి వర్షానికే రోడ్డు కోతకు గురైంది. 4 కిలోమీటర్ల మేర సైడ్ బర్మ్‌లు పూర్తిగా కోతకు గురయ్యాయి. దీంతో వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. – అక్కన్నపేట(హుస్నాబాద్)

క్లుప్తంగా

మెనూ ప్రకారం భోజనం అందించాలి


మొక్క నాటుతున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): విద్యార్థులకు మెనూ ప్రకారంగా మధ్యాహ్న భోజనం అందించాలని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి పాఠశాలల హెచ్‌ఎంలను ఆదేశించారు. మండలంలోని గుడికందుల, లింగంపేట, వరదరాజుపల్లి, చిన్న ముత్యంపేట, గోవర్ధనగిరి పాఠశాలలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. పాఠశాలల ఆవరణలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మునగ, కరివేపాకు మొక్కలతో పాటు పండ్ల మొక్కలు నాటాలన్నారు. బేస్‌లైన్ పరీక్షల నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం గుడికందుల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఈఓ నర్సయ్య, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి


పరశురాములును సన్మానిస్తున్న నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ అన్నారు. శుక్రవారం చిన్నకోడూరులో బీజేపీ మండల కార్యకర్తల సమావేశంలో పాల్గొని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, దిశ కమిటీ సభ్యురాలు వనజ, నాయకులు బాపయ్య, సంతోష్ కుమార్, నాగరాజు, మహేందర్‌రెడ్డి తదితరు లు పాల్గొన్నారు. అనంతరం మండల స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్‌గా పిట్ల పరశురాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


కాలనీవాసులకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్

హుస్నాబాద్: సీజనల్ వ్యాధుల పట్ల పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తెలిపారు. వంద రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని 18వ వార్డులో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీలువ ఉన్న నీటిని పారబోశారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వర్షాకాలం దృష్ట్యా నీరు నిల్వ ఉండడం వల్ల డయేరియా, డెంగీ వంటి అనారోగ్య సమస్యలు ఎదురవుతాయన్నారు. కూలిపోయే స్థితిలో ఉన్న ఇళ్లను పరిశీలించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్లం, పర్యావరణ అధికారి రవికుమార్, వార్డు ఆఫీసర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడలో బాల్యమిత్రుడి తల్లి అంత్యక్రియలకు 1999–2000 బ్యాచ్‌మెంట్స్ రూ. 33,000 ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు. కార్యక్రమంలో ఆరెపల్లి మహాదేవ్, కాట రమేశ్, బింగి వేణు, కొంక శ్రీనివాస్, బూర్గుల సురేందర్‌రావు, జనగామ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు


మాట్లాడుతున్న ఎస్‌ఐ విజయ్‌కుమార్

ములుగు(గజ్వేల్): విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని, గంజాయి, ఇతర మత్తు పదార్థాల జోలికి వెలితే భవిష్యత్తు అంధకారం అవుతుందని ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్ సూచించారు. మండలంలోని క్షీరసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, మహిళల రక్షణ చట్టాలు, మత్తు పదార్థాలు ఆయా అంశాలపై అవగాహన కల్పించారు. అపరిచితుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ అండాలు, హెచ్‌ఎం రవికుమార్, గజ్వేల్ షీటీం బృందం పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

గజ్వేల్ ఏసీపీ నర్సింలు


రికార్డులు పరిశీలిస్తున్న ఏసీపీ నర్సింలు

దౌల్తాబాద్(దుబ్బాక): వార్షిక తనిఖీల్లో భాగంగా మండలంలోని పోలీస్‌స్టేషన్‌ను గజ్వేల్ ఏసీపీ నర్సింలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసులు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వారి సమస్యను పరిష్కరించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. సీజ్ చేసిన వాహనాలను సాధ్యమైనంత త్వరగా యజమానులకు అందజేయాలని సూచించారు. ప్రతి కేసులో పారదర్శంగా వ్యవహరించడంతో పాటు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులు విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దని చెప్పారు. కార్యక్రమంలో తొగుట సీఐ లతీఫ్, ఎస్‌ఐ అరుణ్ కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి


ఎంఈఓ కృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

గజ్వేల్‌రూరల్: పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకపోగా వారి పట్ల ఓ ఉపాధ్యాయుడు అసభ్యకరంగా మాట్లాడుతూ దురుసుగా వ్యవహరిస్తున్నాడని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పేర్కొంటూ గజ్వేల్ ఎంఈవో కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో ప్రతిరోజు పురుగులు వస్తున్నాయని, సరిగ్గా ఉడకని భోజనాన్ని అందిస్తున్నట్లు విద్యార్థులు వాపోయారని పేర్కొన్నారు. తల్లిదండ్రులతో చెప్పే విద్యార్థుల పట్ల ఓ ఉపాధ్యాయుడు అసభ్య పదజాలంతో దూషిస్తూ, దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవడంతో పాటు బాలుర ఉన్నత పాఠశాలలో నాణ్యమైన భోజనం, స్వచ్ఛమైన తాగునీటిని అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అరుణ్, స్వామి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉండొద్దు


నోటీసు అందజేస్తున్న వార్డు ఆఫీసర్ భవాని

హుస్నాబాద్: వర్షాల నేపథ్యంలో పట్టణంలో కూలిపోయే స్థితిలో ఉన్న ఇళ్ల యజమానులకు శుక్రవారం మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేస్తూ ప్రమాదకరంగా ఉన్న 74 ఇళ్ల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో ఎమర్జెన్సీ కాల్ సెంటర్ 7337347610ని ఏర్పాటు చేశారు. మున్సిపల్ కార్యాలయంలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

ఓపెన్ యూనివర్సిటీలో ప్రవేశాలు

గజ్వేల్‌రూరల్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2025–26 విద్యా సంవత్సరంలో డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ గ్రూపులలో ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాల్లో విద్యనభ్యసించేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గల అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సమన్వయకర్త డాక్టర్ భవాణి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ పొందేందుకు ఇంటర్‌తో పాటు ఓపెన్ స్కూల్, పాలిటెక్నిక్, ఐటీఐ అభ్యసించిన వారు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆగస్టు 13లోగా టీఎస్ ఆన్‌లైన్ లేదా, మీసేవ, ఇంటర్నెట్ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 7382929738 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నూతన నియామకం



దుబ్బాకటౌన్: జాతీయ మానవ హక్కుల సంక్షేమ సంస్థ జిల్లా అధ్యక్షుడిగా దుబ్బాకకు చెందిన రసూల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షురాలు, హైకోర్టు న్యాయవాది స్వప్న శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా రసూల్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్నకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మానవ హక్కుల ఉల్లంఘన జరగకుండా హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు.

పొడి వాతావరణంలోనే ఎరువులు వేయాలి

వర్గల్(గజ్వేల్): పొడి వాతావరణంలోనే ఎరువులు వేయాలని వర్గల్ మండల వ్యవసాయాధికారి శేషశయన అన్నారు. వచ్చే మూడు రోజులు భారీ వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికలు మరచిపోవద్దన్నారు. ఉరుములు, మెరుపులు, వర్షాల నేపథ్యంలో ప్రజలు చెట్ల కింద ఉండొద్దని సూచించారు. నానో యూరియా, నానో డీఏపీ ఉపయోగిస్తే మొక్కలకు సమంగా పోషకాలు అందుతాయన్నారు. వర్షాకాలంలో అత్యధికంగా 14,360 ఎకరాల్లో వరి, 1500 ఎకరాల్లో మొక్కజొన్న, 1050 ఎకరాల్లో స్వీట్‌కార్న్, 2,000 ఎకరాల్లో కూరగాయలు సాగుచేస్తారని అంచనాగా ఆమె పేర్కొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పలు ప్రాంతాల్లో తమ సిబ్బందితో కలిసి కొన్ని రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 9 మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి రూ. 14,500 జరిమానా విధించారు. వీరిలో నలుగురికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

ములుగు తహసీల్దార్, డీటీ బదిలీ

- ఏసీబీ దాడుల 'ఎఫెక్ట్'
- నూతన తహసీల్దార్‌గా రవీందర్‌రెడ్డి బాధ్యతలు



ములుగు(గజ్వేల్): ఏసీబీ దాడుల నేపథ్యంలో ములుగు తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌పై బదిలీ వేటు పడింది. ఇటీవల డిప్యూటీ తహసీల్దార్ భవానిపై అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ అధికారులు రెవెన్యూ కార్యాలయంపై దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే. డిప్యూటీ తహసీల్దార్‌పై సైతం కేసు నమోదు చేశారు. ఇది చర్చనీయాంశం కావడంతో అధికారుల ప్రక్షాళన చేపట్టారు. ఇందులో భాగంగా ములుగు నూతన తహసీల్దార్‌గా రవీందర్‌రెడ్డి నియమితులయ్యారు. శుక్రవారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ ఆరీఫా హుస్నాబాద్ ఆర్డీఓ కార్యాలయానికి డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి(డీఏఓ)గా బదిలీపై వెళ్లగా, అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న డిప్యూటీ తహసీల్దార్ భవాని ల్యాండ్ అక్విజేషన్ డీటీగా సిద్దిపేటకు బదిలీ అయ్యారు. కొత్త అధికారుల రాకతో కార్యాలయంలో సేవలు మెరుగుపడుతాయని మండల ప్రజలు, రైతులు భావిస్తున్నారు.

యూజీడీ పనితీరుపై అధికారుల ఆరా


యూజీడీ వ్యవస్థను పరిశీలిస్తున్న అధికారులు

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలోని అండర్ గ్రౌండ్ వ్యవస్థ (యూజీడీ) పనితీరును సంబంధిత ఉన్నతాధికారులు శుక్రవారం పరిశీలించారు. హైదరాబాద్ ఎస్ఈ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిజామాబాద్ కార్పొరేషన్, కొడంగల్ మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వారికి సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ వివరించారు. అనంతరం పట్టణంలోని పలు వార్డుల్లో యూజీజీ వ్యవస్థపై ఆరా తీశారు. అనంతరం మురికి నీటి శుద్ధికరణ ప్లాంట్(ఎస్టీపీ)ను పరిశీలించారు. అంతకుముందు కోమటి చెరువును సందర్శించారు. కొబ్బరిచెట్లు ఆకర్షణీయంగా ఉన్నాయని, కోనసీమ తరహాలో ఉందని కితాబిచ్చారు. వారి వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, వైస్‌చైర్మన్ కనకరాజు డీఈ ప్రేరణ నిజామాబాద్, కొడంగల్, కోస్గి మున్సిపల్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

జేఏసీ బంద్ విజయవంతం


మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ పరమేశ్వర్

చేర్యాల(సిద్దిపేట): రెవెన్యూ డివిజన్ ఏర్పాటును కోరుతూ శుక్రవారం జేఏసీ చేపట్టిన నాలుగు మండలాల బంద్ విజయవంతమైంది. బంద్‌కు మద్దతుగా పట్టణంతో పాటు మద్దూరు, కొమురవెల్లి, దూళ్మిట్ట మండల కేంద్రాల్లో వ్యాపార సంస్థలు స్వచ్ఛందగా బంద్ పాటించాయి. ఈసందర్భంగా జేఏసీ చైర్మన్ పరమేశ్వర్ మాట్లాడుతూ.. చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటిస్తామని హామీ ఇచ్చి 18 నెలలు గడిచినా నెరవేర్చకపోవడం సరికాదన్నారు. రెవెన్యూ డివిజన్ సాధించేవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు అశోక్, బీరయ్య, సత్యనారాయణ, చంద్రం, వెంకటాద్రి, సుధాకర్, భూమయ్య, రమేష్, మమత తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి


హబ్సీపూర్‌లో మొక్క నాటుతున్న ఎంపీడీఓ భాస్కరశర్మ తదితరులు

దుబ్బాకరూరల్/హుస్నాబాద్‌రూరల్: వన మహోత్సవంలో భాగంగా మండలంలోని హబ్సీపూర్ జాతీయ రహదారి పక్కన ఎంపీడీఓ భాస్కరశర్మ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని రక్షించే బాధ్యత సైతం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యాపారవేత్తలు చింత రాజు, నల్ల శ్రీనివాస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు. అలాగే హుస్నాబాద్ మండలంలోని గాంధీనగర్, రాములపల్లిలో ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి మొక్కలను నాటారు. వర్షాలు కురిసే సమయంలోనే పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది మొక్కలను నాటుతే ప్రాణం పోసుకుంటాయని చెప్పారు. కార్యక్రమంలో టీఏ పర్షరాములు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ దామోదర్‌రావు

మద్దూరు(హుస్నాబాద్): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ దామోదర్‌రావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గాగిల్లాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇంటి నిర్మాణాలు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాధిక తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యారంగంలో నెలకొన్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు అందె రామచంద్రం డిమాండ్ చేశారు. శుక్రవారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో జాప్యం చేస్తుందన్నారు.

◆ బీజేపీ జెండా ఎగురవేయాలి

కొమురవెల్లి(సిద్దిపేట): స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలవ్యాప్తంగా బీజేపీ ఎండా ఎగురవేయాలని స్థానిక సంస్థల ఎన్నికల ఇన్‌చార్జి తోకల ఉమారాణి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో జనగామ అసెంబ్లీ కన్వీనర్ దండ్యాల లక్ష్మారెడ్డి, చేర్యాల పట్టణ అధ్యక్షులు కర్క తిరుపతిరెడ్డి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ 'కేడీసీసీ' నూతన కార్యాలయం పరిశీలన

బెజ్జంకి(సిద్దిపేట): కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (కేడీసీసీబీ) బెజ్జంకి శాఖ నిర్మించిన నూతన భవన బ్యాంకు పనులను పాక్స్ చైర్మన్ తన్నీరు శరత్‌రావు శుక్రవారం పరిశీలించారు. సొంత భవనంలో బ్యాంకు సేవలను ఖాతాదారులకు త్వరలోనే సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట వైస్ చైర్మన్ బండి రమేష్, సీఈఓ వాసు, బ్యాంకు సిబ్బంది అంజి, నాయకులు మధు తదితరులు పాల్గొన్నారు.

◆ ఏపీఎంల జిల్లా అధ్యక్షుడిగా తిరుపతిగౌడ్



కోహెడ(హుస్నాబాద్): కోహెడ ఐకేపీ ఏపీఎం తిరుపతిగౌడ్ ఏపీఎంల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారిగా ఆంజనేయులు ఎన్నికయ్యారు. ఈసందర్భంగా శుక్రవా రం సిద్దిపేటలో డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ ఆర్యను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కార్యవర్గానికి పీడీ శుభాకాంక్షలు తెలిపారు.

◆ వికలాంగుల పింఛన్ పెంచాలి

హుస్నాబాద్/గజ్వేల్: కాంగ్రెస్ ప్రభుత్వం వృద్ధులు, వితంతువులకు రూ. 4 వేలు, వికలాంగులకు రూ. 6 వేలు పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. హుస్నాబాద్‌కు ఆగస్టు 3వ తేదీన మందకృష్ణ మాదిగ రానున్నారని తెలిపారు. అలాగే గజ్వేల్ పట్టణంలో ఎమ్మార్పీఎస్‌తో పాటు ఇతర అనుబంధ సంస్థలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

◆ క్రమశిక్షణ అలవర్చుకోవాలి

నంగునూరు(సిద్దిపేట): చెడు అలవాట్లకు బానిస కాకుండా క్రమశిక్షణ అలవర్చుకోవాలని రాజగోపాల్‌పేట ఎస్‌ఐ వివేక్ అన్నారు. శుక్రవారం మగ్దుంపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహనకల్పించారు.

◆ చేతిరాతతోనే మంచి మార్కులు



హుస్నాబాద్: విద్య అనే నాణేనికి చదవటం, రాయటం అనేవి బొమ్మ బొరుసులాంటివని ప్రఖ్యాత చేతిరాత నిపుణుడు ఎజాజ్ అహ్మద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చేతిరాత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలందరి చేత స్వయంగా పుస్తకాలల్లో రాయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేతలను బట్టి భవిత ఆధారపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వాసుదేవరెడ్డి, ఆంగ్ల ఉపాధ్యాయుడు పంజ రాజమల్లు, ఉపాధ్యాయులు వీరారెడ్డి, రమేష్, వెంకటమల్లు, తదితరులు పాల్గొన్నారు.

◆ సమస్యల పరిష్కారానికి మహాధర్నా

బెజ్జంకి(సిద్దిపేట): ఉపాధ్యాయుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించకుంటే త్వరలోనే మహాధర్నా చేపడతామని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శశిధర్‌శర్మ హెచ్చరించారు. శుక్రవారం బెజ్జంకిలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నిర్వహించారు. ఆగస్టు 15లోపు ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. లేకపోతే సెప్టెంబర్ 1న పదివేల మంది ఉపాధ్యాయులతో ఇందిరాపార్క్ వద్ద ఆందోళన చేస్తామన్నారు.

◆ గొయ్యి పూడ్చివేత

వర్గల్(గజ్వేల్): వానలు పడుతున్నాయి. నీళ్లు చేరిన గోతులు మృత్యుకుహరాలుగా మారే పరిస్థితి నెలకొంది. ఇలాంటి తరుణంలో గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి చొరవ తీసుకుని పోలీస్‌స్టేషన్ సమీప పరిశ్రమ మలుపు వద్ద రాజీవ్ రహదారి పక్కన ప్రమాదకరంగా మారిన గొయ్యిని శుక్రవారం జేసీబీతో పూడ్చివేయించారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చేశారు.